సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 10 । ఆగస్టు । 2023



‘ధ్రువీకరణ’లో జాప్యం

జిల్లాలోని పలు మండలాల్లో తహసీలార్లు అందుబాటులో లేక కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. 8లో



అక్టోబర్ నాటికి విద్యుదుత్పత్తి

రామవరం సోలార్ ప్లాంట్‌లో అక్టోబర్ నాటికి విద్యుత్ ఉత్పత్తి కావాలని సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం వేళ ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక బుధవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేత, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా స్వర్ణలక్ష్మీ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెంకటరెడ్డికి హైకోర్టులో ఊరట

జూలూరుపాడు: జూలూరుపాడు పీఏసీఎస్ చైర్మన్ పదవి నుంచి లేళ్ల వెంకటరెడ్డిని తొలగిస్తూ వరంగల్ కో– ఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మధ్యంతర సస్పెన్షన్‌ను మంజూరు చేసింది. దీంతో వెంకటరెడ్డికి ఊరట లభించింది. న్యాయవాది పి.సాత్విక్ రెడ్డి సమర్పించిన లంచ్ మోషన్‌పై హైకోర్టు ఈ వ్యాజ్యాన్ని అత్యవసర విచారణకు స్వీకరించింది. న్యాయవాది దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఈనెల 7న వరంగల్ ట్రిబ్యునల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో పీఏసీఎస్ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి కొనసాగనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కమాండెంట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): చాతకొండ 6వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాదరెడ్డి బుధవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

కమలేష్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న జయరాజు

చండ్రుగొండ : గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల సమస్యలపై అధ్యయనం చేసిన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని తపాలా ఉగ్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్వీస్‌కు అనుగుణంగా ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. గ్రూప్ బీమా, గ్రాడ్యుటీ రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 12 నుంచి దశల వారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టాభిరామయ్య, డివిజన్ కార్యదర్శి మౌలాలి, కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ ఉన్నారు.

విధుల్లోకి పంచాయతీ కార్మికులు

అశ్వారావుపేట: గత 34రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు బుధవారం విధుల్లో చేరారు. తమ సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇవ్వడంతో జేఏసీ పిలుపు మేరకు సమ్మె విరమించారు. ఇన్ని రోజులు తమకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆశలు హరీ?

కొందరు సిట్టింగ్‌లను మార్చే యోచనలో బీఆర్‌ఎస్

- మార్పు ప్రచారంలో నానుతున్న ఇల్లెందు పేరు
- హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దంటున్న అసమ్మతి నేతలు
- ఆమె భర్త హరిసింగ్ ఇబ్బంది పెడుతున్నారంటూ ఫిర్యాదులు



హరిప్రియ, హరిసింగ్ నాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఎన్నికల వేళ ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌కు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఎమ్మెల్యే భర్త, హరిసింగ్ నాయక్ షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తూ పార్టీ వ్యవహారాల్లో మితిమీరి జోక్యం చేసుకుంటూ అసలుకే ఎసరు తెచ్చారని నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. ఇప్పటి నుంచే ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బీఆర్‌ఎస్.. సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా జెట్ స్పీడ్‌తో పట్టాలెక్కిస్తోంది. నియోజకవర్గాల వారీగా పార్టీ విజయావకాశాలపై ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 18 మందికి టికెట్లు గల్లంతు కావొచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ 18 మందిలో జిల్లా నుంచి ఎవరైనా ఉన్నారా అనే ఆరాలు పెరిగాయి. నిన్నా మొన్నటి వరకు ఈ విషయంలో కొత్తగూడెం నియోజకవర్గ పేరు ఎక్కువగా వినిపించేది. వనమా ఎన్నికపై దాఖలైన కేసు తీర్పు, సుప్రీం కోర్టులో సవాల్ తదితర అంశాలతో ప్రస్తుతం కొత్తగూడెం సైడ్ ట్రాక్‌లోకి వెళ్లగా, ఆ స్థానాన్ని ఇల్లెందు నియోజకవర్గం ఆక్రమించింది.

మా అభ్యర్థన ఆలకించండి..

గత ఆరు నెలలుగా ఇల్లెందులో సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియకు తిరిగి టికెట్ ఇవ్వొద్దంటూ అసమ్మతి వర్గం నేతలు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారు. ఆమెకు టికెట్ ఇస్తే క్షేత్రస్థాయిలో పూర్తి సహకారం అందించలేమని, తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. హరిప్రియకు బదులు ఎవరికి టిక్కెట్ ఇవ్వాలో కూడా పార్టీ పెద్దలకు ఇప్పటికే సూచించారు. అయితే ఈ అంశంపై బీఆర్‌ఎస్ అధిష్టానం నుంచి పెద్దగా స్పందన రాలేదని తెలిసింది. కానీ గత రెండు వారాలుగా పరిస్థితిలో తేడా వచ్చింది. ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇల్లెందుపై దృష్టి పెడుతున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా చాపకింద నీరులా పని చేసుకుపోతున్నారు.

ఎంపీ కవిత సంచలన వ్యాఖ్యలు..

జూలైలో కురిసిన భారీ వర్షాలతో వరదలు పోటెత్తగా మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత ఇటీవల బాధితులను పరామర్శించారు. ఈ క్రమంలో ఆమె ఇల్లెందు నియోజకవర్గానికి వచ్చారు. సీఎం కేసీఆర్ ఆదేశిస్తే మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీకి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఆ సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియ స్థానికంగా లేరు. కవిత మాటల వెనుక దీర్ఘకాలిక వ్యూహం ఉందనే చర్చ మొదలైంది. మహబూబాబాద్ జిల్లాలోని రెండు స్థానాల్లో పార్టీ టికెట్ దక్కని పక్షంలో ఇల్లెందు నుంచైనా అసెంబ్లీకి పోటీ చేసేందుకు కవిత రెడీగా ఉన్నారనే ప్రచారం తెరమీదకు వచ్చింది.

షాడో ప్రభావం..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నుంచి హరిప్రియ కాంగ్రెస్ తరఫున గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వేదికగా హరిసింగ్ ఇటు ప్రభుత్వ, అటు పార్టీ కార్యక్రమాల్లో చక్రం తిప్పుతున్నారు. షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తూ తనకంటూ సొంత వర్గం ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలో అప్పటివరకు పార్టీలో పని చేస్తూ వచ్చిన నేతలంతా తీవ్ర అసౌకర్యానికి గురవడం మొదలైంది. ద్వితీయ శ్రేణి నేతలు, వారి అభిప్రాయాలను హరిసింగ్ ఖాతరు చేయడం లేదనే ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కామేపల్లి, గార్ల, బయ్యారం, ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో కారు పార్టీ నేతలకు హరిసింగ్ వ్యవహార శైలితో కంటి మీద కునుకు లేని పరిస్థితులు ఏర్పడ్డాయని కొందరు గులాబీ నేతలే అంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మండలాల వారీగా ఉన్న అసమ్మతి నాయకులంతా ఒక్కటవుతున్నారు. షాడో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తూ హరిసింగ్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తున్నారు.

జీవన్‌లాల్ సేవా క్యాంపులు..

వైరా ఎమ్మెల్యే రాములునాయక్ తనయుడు జీవన్‌లాల్ రాజకీయ ఆరంగేట్రానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదాయ పన్ను శాఖ ఉద్యోగిగా ఆయన కొనసాగుతున్నారు. ఇంతవరకూ హైదరాబాద్‌కే ఎక్కువగా పరిమితం అయిన జీవన్‌లాల్.. సిట్టింగ్ అభ్యర్థుల్లో కొన్ని మార్పులు ఉంటాయనే ప్రచారంతో పావులు కదపడం ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి పార్లమెంట్‌కు పోటీ చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. కానీ అనూహ్యంగా ఆయన ఇల్లెందులో క్యాంప్ కార్యాలయం ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. ఇల్లెందు నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాల కారణంగానే ఇక్కడ క్యాంప్ వెలిసిందనే వార్తలు జోరుగా సాగుతున్నాయి.

‘మద్యం’ దరఖాస్తులు @ 33



కొత్తగూడెం అర్బన్: జిల్లాలో నూతన మద్యం దుకాణాల కోసం ఈనెల 4 నుంచి బుధవారం నాటికి మొత్తం 33 దరఖాస్తులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియను ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ సురేష్‌రాథోడ్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ గిరిజన ద్రోహి



ఆదివాసీలతో కలిసి నృత్యం చేస్తున్న పొంగులేటి, కోరం కనకయ్య



వరినాటు వేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ట్రైబల్ యూనివర్సిటీ సాధనలో విఫలం
- ‘గిరిజన బంధు’ హామీ బుట్టదాఖలు
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు: సీఎం కేసీఆర్ గిరిజన ద్రోహి అని, గిరిజన విశ్వ విద్యాలయం సాధించడంలో విఫలమయ్యారని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జల్ జంగిల్ జమీన్ నినాదం స్ఫూర్తిగా హక్కుల సాధన, రాజ్యాధికారం కోసం పోరాడాలని ఆదివాసీలకు ఆయన పిలుపునిచ్చారు. ఇల్లెందులో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. కొమురం భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అడవులవిస్తీర్ణం పెంపు సాకుతో గిరిజనుల నుంచి బలవంతంగా పోడు భూములు లాక్కుని తరిమేశారని, గిరిజన బంధు పథకం అమలులో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. 12.49 లక్షల ఎకరాలకు పోడుపట్టాలు ఇవ్వకుండా గిరిజనులను మోసం చేశారని ఆరోపించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఆదివాసీల మనుగడ కోసం జాతి నేతల ఉద్యమాలను వారసత్వంగా తీసుకుని పోరాడాలని, అధికారం సాధించడంతోనే గిరిజన జాతి అభివృద్ధి చెందుతుందని అన్నారు.

మాణిక్యారం, పోలారంలో భారీగా చేరికలు

ఇల్లెందురూరల్: మరో ఆరు మాసాల్లో రాష్ట్రంలో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మాణిక్యారం, మసివాగు, ముత్తారపుకట్ట, పోలారం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీల్లో పూర్తిస్థాయిలో ఎన్ని అమలు చేశారో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, మళ్లీ ఎన్నికలు సమీపస్తుండటంతో అనేక పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. ఇంత కాలం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఇప్పుడు ప్రవేశపెట్టే పథకాలకు రేషన్ కార్డు జత చేయాలని చెప్పడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అంతకు ముందు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. కూలీలతో కలిసి వరి నాటు వేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ముక్తి కృష్ణ, తాటి భిక్షం, సురేందర్, సాంబమూర్తి, సూర్యం, డానియేల్, పులి సైదులు, సుదర్శన్ కోరీ, గణేష్, పోచాలు, మధుసూదన్‌రెడ్డి, లక్కినేని సాయి, వెంకటేశ్వరరావు, సర్పంచ్ పాయం స్వాతి, పాయం లలిత, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, బానోత్ రోజా, పీఏసీఎస్ డైరెక్టర్ కిన్నెర నర్సయ్య, పూనెం సంధ్య, తాటి యశోద, బానోత్ రాంబాబు, భానుచందర్, పూనెం సురేష్, చెన్నూరి శ్రీనివాస్, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

నర్సాయిగూడెంలో జెడ్పీ చైర్మన్ రాత్రి బస



నర్సాయిగూడెంలో నిద్రిస్తున్న కోరం

టేకులపల్లి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ, గిరిజన గూడేల్లో రాత్రి బస చేయాలని ఏఐసీసీ పిలుపు మేరకు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బేతంపూడి పంచాయతీ నర్సాయిగూడెంలో బుధవారం పల్లె నిద్ర చేశారు. స్థానిక ఆదివాసీలతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేస్తున్న మోసాలు, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేయబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో మడుగు సాంబమూర్తి, వై.బాబు, మోకాళ్ల పోశాలు, గడ్డం మధురెడ్డి, ఈది గణేష్, పూనెం సురేందర్ బోళ్ల సూర్యం, రావూరి సతీష్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని రక్షించుకోవాలి



కలెక్టర్ ప్రియాంక ఆలకు నాయక్‌పోడు బొమ్మ అందజేస్తున్న ఆదివాసీలు



కొమ్ములు ధరించి గిరిజన వేషధారణలో పీఓ ప్రతీక్ జైన్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్, ఐటీడీఏ పీఓ

భద్రాచలంఅర్బన్ : ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకుంటూ ఆదివాసీ తెగ అంతరించిపోకుండా చూడాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. భద్రాచలంలోని ఆదివాసీ గిరిజన భవనంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు, గంటం దొర, మల్లు దొర వంటి ఎందరో ఆదివాసీలు దేశం కోసం ప్రాణాలర్పించారని తెలిపారు. అలాంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే 1982లో ఐక్యరాజ్యసమితి నెదర్లాండ్‌లో 140 దేశాల ప్రతినిధులు పాల్గొని ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా నిర్వహించాలని తీర్మానం చేశారని చెప్పారు. జిల్లాలో ఆదివాసీలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని, వారి జీవనోపాధికి కృషి చేస్తానని అన్నారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఆదివాసీల పిల్లల కోసం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజనులు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా అర్హులైన వారికి పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీల సంస్కృతి సంప్రదాయ నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్, ఏఓ భీమ్, గిరిజన సంక్షేమ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నరసింహారావు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, గిరిజన సంఘాల నాయకులు పూణే కృష్ణ, పాయం రవివర్మ, శరత్‌బాబు, మురళి, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, శ్రీరామ్మూర్తి, సుధారాణి, అరుణ, వెంకటరావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బుధవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పటిష్ట భద్రత కొనసాగించాలని ఆదేశించారు. గోదాం తనిఖీ నివేదికను ఎన్నికల కార్యాలయానికి పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్నికల పర్యవేక్షకులు ప్రసాద్, రంగాప్రసాద్, శర్మ, సాయికృష్ణ పాల్గొన్నారు.

వార్షిక మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

టీఎస్ జెన్‌కో డైరెక్టర్ బాదావత్ లక్ష్మయ్య

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో వార్షిక మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేయాలని జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య సూచించారు. బుధవారం ఆయన కర్మాగారాన్ని సందర్శించి, వార్షిక మరమ్మతులు నిర్వహించాల్సిన 500, 250 మెగా వాట్ల యూనిట్ల వివరాలు ఆరా తీశారు. ఉత్పత్తిలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఈ(జనరేషన్) పి.రత్నాకర్, 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు, ఎస్‌ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, ధర్మారావు, పి.కృష్ణ, డీవైసీసీఏ పి.రామారావు, బి.మోక్షవీర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నిబంధనలు పాటించాలి



మిరపనారు పరిశీలిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మిరప నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రాష్ట్ర ఉద్యాన ఉప సంచాలకులు పి.వి. భాగ్యలక్ష్మీ, సహాయ సంచాలకులు జి.సువర్ణ అన్నారు. జూలూరుపాడు, సుజాతనగర్, టేకులపల్లి మండలాల్లో బుధవారం మిరపనారు నర్సరీలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన నారు పెంచి ఇవ్వాలని సూచించారు. మేలైన యాజమాన్య పద్ధతులు, వేపనూనె వంటి సేంద్రియ పద్ధతులు పాటించాలని ఆదేశించారు. నర్సరీ చట్టం ప్రకారం రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న, ఉద్యాన అధికారులు కె సందీప్, ఆర్.శాంతిప్రియ, కార్యాలయ అధికారి ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ అయ్యేనా ?

- పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకలకు పెంచాలనే డిమాండ్
- జిల్లా కేంద్ర ఆస్పత్రికి దీటుగా వైద్య పరీక్షలు
- తాజాగా ఇల్లెందు, అశ్వారావుపేట ఆస్పత్రులకు మోక్షం
- పాల్వంచ ఆస్పత్రి ప్రతిపాదనలకే పరిమితం



వైద్య పరీక్షల కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్న ఆస్పత్రి

పాల్వంచ: పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పాల్వంచలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలు అందడం లేదు. రోజువారీ ఓపీ, ఐపీల్లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రితో పోటీ పడుతున్నప్పటికీ.. ఇన్ పేషెంట్లకు సరిపడా పడకలు లేక ఇబ్బంది కలుగుతోంది. పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రస్తుతం 50 పడకల ఆస్పత్రిగా కొనసాగుతోంది. కానీ ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉంటుండటంతో వైద్యాధికారులే చొరవ తీసుకుని 78 పడకలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కావడంతో రోజుకు 400 నుంచి 500 మంది పరీక్షల కోసం వస్తున్నారు. నెలకు సుమారు 100 ఆపరేషన్లు చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా 60 నుంచి 70 కేసులు తీసుకుంటున్నారు. అయితే 100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని ఎంతో కాలంగా స్థానికులు, వైద్యులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఇల్లెందు, అశ్వారావుపేట ఆస్పత్రులను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అయితే, ఎన్నాళ్లుగానో డిమాండ్ ఉన్న పాల్వంచ ఆస్పత్రిపై మాత్రం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లా ఆస్పత్రితో పోటీ..

పాల్వంచ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగ్గా ఉంటాయనే నమ్మకంతో పాల్వంచతో పాటు ములకలపల్లి, బూర్గంపాడు మండలాల నుంచి కూడా అనేక మంది వైద్య పరీక్షల కోసం వస్తుంటారు. దీంతో క్రమేణా పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల బూర్గంపాడు మండలం సోంపెల్లి గ్రామం మొత్తం జ్వరాల బారిన పడగా భద్రాచలం ఆస్పత్రికి వెళ్లకుండా పాల్వంచ వచ్చారంటే ఇక్కడి సేవలకు తార్కాణంగా చెప్పవచ్చు. ఇతర మండలాల నుంచి వచ్చే వారికి ఇక్కడ చికిత్స అందిస్తుండటంతో స్థానికులకు వైద్య సౌకర్యాలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పడకలు లేక కొన్నిసార్లు పాల్వంచ మండలానికి చెందిన వారే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. డాక్టర్లు సైతం ఒక్కో గదిలో ఇద్దరు ముగ్గురు చొప్పున కూర్చుని ఓపీ చూడాల్సి వస్తోంది. సౌకర్యవంతమైన పరికరాలు ఉన్నా విశాలమైన గదులు లేక వచ్చి పోయే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి కూర్చోవడానికి కూడా స్థలం దొరడం లేదు. జ్వరాల సీజన్‌లో 400 మందికి పైగా వస్తుండటంతో అందరికీ సరిపడా వైద్యం అందించడం డాక్టర్లకు తలకు మించిన భారంగా మారింది. మరో వైపు వాహనాల పార్కింగ్ స్థలం కూడా సరిపోక ఆటో వంటి వాహనాలకు లోపలికి అనుమతి నిలిపేశారు.

అభివృద్ధి, విస్తరణ పెండింగ్‌లోనే..

100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి గతంలో రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులతో ఆస్పత్రిపైన మరో ఫ్లోర్ నిర్మించి, మేల్, ఫిమేల్ వార్డులు, సర్జరీ వార్డు, జనరల్ వార్డు, పోస్ట్ ఆపరేషన్ వార్డులుగా విస్తరించాలని సంకల్పించారు. కానీ ప్రతిపాదనలకు మోక్షం లభించకపోవడంతో ఆస్పత్రి అభివృద్ధి సాధించడం లేదు. కాగా, ఈ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు మరోసారి ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు బుధవారం సూచించారు.

ప్రతిపాదనలు సమర్పించాం



ఆస్పత్రి విస్తరణ కోసం గతంలో రూ.6 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. పాల్వంచ, చుట్టుపక్కల ప్రజలు అత్యధికంగా ఇక్కడికే వైద్యం కోసం వస్తుండటంతో ఆస్పత్రి చాలడం లేదు. సరిపడా వైద్య సిబ్బంది ఉన్నా రోగులకు సరైన సౌకర్యాలు అందించలేక పోతున్నాం.

–ముక్కంటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

పరిమితికి మించి బెడ్లు వేశాం..



ఆస్పత్రి పరిమితి 50 పడకలే. కానీ ప్రస్తుతం 78 బెడ్స్ వేసి వైద్య సేవలు అందిస్తున్నాం. జ్వరాల సీజన్‌లో రోజూ 400 నుంచి 500 వరకు ఓపీ వస్తోంది. వారిలో ఇన్ పేషెంట్ల శాతం కూడా ఎక్కువగా ఉంటోంది. సర్జరీలు సైతం రోజుకు రెండు, మూడు చేస్తున్నాం. అప్‌గ్రేడ్ చేస్తే వైద్యసేవలు మరింతగా అందించొచ్చు.

– డాక్టర్ సోమరాజు దొర, సర్జన్

క్లుప్తంగా

బొగ్గు రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలి



బొగ్గు రవాణా ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ముందస్తు జాగ్రత్తలతో బొగ్గు రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని జీఎం(సీహెచ్‌సీ) నవీన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి ఏరియాలోని కేసీహెచ్‌పీని సందర్శించి బొగ్గు రవాణా ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు బ్రేక్ డౌన్ లేకుండా బొగ్గు సరఫరా చేయాలని సూచించారు. అనంతరం పీకేఓసీ–4, మణుగూరు ఓసీలను పరిశీలించారు. ఆ తర్వాత జీఎం(సీహెచ్‌పి)ని స్థానిక అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, రమేష్, అనురాధ, శ్రీనివాసరావు, వీరభద్రుడు, మధన్ నాయక్, నిరంజన్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సహాయ పౌరసంబంధాల అధికారిగా అజ్గర్ హుస్సేన్



అజ్గర్ హుస్సేన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా సహాయ పౌరసంబంధాల అధికారిగా ఎండీ అజ్గర్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. హన్మకొండ డీపీఆర్వో కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న హుస్సేన్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆర్‌జెడీ డీఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీపీఆర్వో శ్రీనివాసరావు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడల అభివృద్ధిపై చర్చ



క్రీడా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: నూతనంగా నియమితులైన జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డిని బుధవారం జిల్లాలోని పలు క్రీడా సంఘాల నాయకులు కలిశారు. చుంచుపల్లి విద్యానగర్ కాలనీలోని జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పి.కాశీహుస్సెన్, ఆదినారాయణ, మట్టపర్తి రమేష్, ఇ మొగిలి, స్వాతి ముత్యం, ఇ.శ్రీధర్, వెంకటనారాయణ, జి. హనుమంతరాజు.ఎస్‌కే ఇమామ్, డి. జాన్సన్ డేవిడ్, సదానందం, టీ. ప్రసాద్, ఎం. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి




అంబేడ్కర్‌నగర్‌లో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న అధికారులు

చుంచుపల్లి: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీపీఓ రమాకాంత్ సిబ్బందికి సూచించారు. బుధవారం వారు విద్యానగర్, వెంకటేశ్వర కాలనీ, పెనుబల్లి, రాంపురం, అంబేడ్కర్ నగర్ గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. డ్రైయిన్లు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయ డం, బ్లీచింగ్, ఫాగింగ్ విధానాల గురించి పంచాయతీ సిబ్బందితో చర్చించారు. ఇంటింటికీ మొక్కల పంపిణీ చేపట్టి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వారి వెంట ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు లలిత, అరుణ, ఉపేందర్, రఘు, బొంతు బాబురావు, చెన్నకేశవ, వసంత, కార్తీక్ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో గతంలో విధులు నిర్వహించిన ఏసుపాక సీతారామరాజు అనే ఉపాధ్యాయుడిపై దాడి చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడనే నెపంతో నర్సాపురం పాఠశాల ఉపాధ్యాయులు గుగులోత్ తులసమ్మ, ధారవత్ పన్నాలాల్‌తోపాటు భూక్యా సైదులు, గుగులోత్ రమేష్ గత ఫిబ్రవరి 13న గతంలో అదే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు సీతారామరాజుపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు దాడికి పాల్పడ్డ నలుగురిపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

‘ధ్రువీకరణ’లో జాప్యం

- వారం రోజులు గడిచినా అందని సర్టిఫికెట్లు
- తహసీల్దార్ల బదిలీలతో నెలకొన్న సమస్య
- అవస్థ పడుతున్న విద్యార్థులు, దరఖాస్తుదారులు
- కంప్యూటర్ ఆపరేటర్ల తీరుపైనా విమర్శలు



కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి తర్వాత ఉన్నత చదువులు చదివేందుకు కళాశాలలో అడ్మిషన్లు పొందాలంటే కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు తప్పనిసరిగా మారాయి. బ్యాంకు రుణం, ప్రభుత్వ పథకానికీ దరఖాస్తు చేసుకోవాలంటే ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. కళాశాలల్లో ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర కళాశాలల్లో చేరే విద్యార్థులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రుణాలకు దరఖాస్తులు చేసుకునేవారి పరిస్థితి కూడా అలాగే ఉంది. వారం క్రితం దరఖాస్తు చేసుకున్నవారికి కూడా సర్టిఫికెట్లు మంజూరు కాలేదు. ఆర్‌ఐలు వెరిఫికేషన్ చేసి, సంతకాలు చేసి సిద్ధం చేసినా జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు, రుణాల దరఖాస్తుదారులు, సర్టిఫికెట్లు అవసరాలున్న వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం దళితబంధు, గృహలక్ష్మి వంటి పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే వారు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నారు. ఎలక్షన్ సమయం సమీపిస్తున్న తరుణంలో తహసీల్దార్లకు హైదరాబాద్‌లో ట్రెనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం మరో మూడు రోజులపాటు జరుగుతుందని సమాచారం. అనంతరం సెలవులు ఉండటంతో సర్టిఫికెట్లు అందే పరిస్థితి లేదు.

జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్‌ఐ, తహసీల్దార్ సర్టిఫికెట్లను పరిశీలించి సంతకాలు చేసి ధ్రువీకరించినా.. కంప్యూటర్‌లో వివరాలు ఎంట్రీ చేసి అప్రూవల్ ఇచ్చే వారి తీరుపై దరఖాస్తుదారులు, ఆఫీసు ఉద్యోగులు, సిబ్బంది సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కలుగజేసుకుని చెప్పినా కంప్యూటర్ ఆపరేటర్లు వినిపించుకోని పరిస్థితి నెలకొన్నది. కార్యాలయంలో పని చేసే వారికి చుక్కలు చూపిస్తున్నారంటే సామాన్యులను ఇంకెంత ఇబ్బంది పెడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కంప్యూటర్ ఆపరేటర్ల తీరుపై నూతనంగా వచ్చిన తహసీల్దార్, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, సర్టిఫికెట్ల అప్రూవల్ సరైన సమయంలో ఇచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు. లేకపోతే కళాశాలల్లో అడ్మిషన్లు పొందేవారు, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకునేవారు అవస్థ పడతారని పేర్కొంటున్నారు.

గత వారం 20 మంది తహసీల్దార్ల బదిలీ

జిల్లాలో గత వారం 20 మంది తహసీల్దార్లను బది లీ చేస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అనంతరం మరుసటి రోజు విధుల్లో చేరినప్పటికీ డిజిటల్ కీ రాకపోవడంతో సర్టిఫికెట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత రోజు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న తహసీల్దార్లు హైదరాబాద్‌కు ట్రెనింగ్ నిమిత్తం వెళ్లారు. దీంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం నెలకొన్నది. దీంతో కార్యాలయాల్లో వందల సంఖ్యలో సర్టిఫికెట్స్ నిలిచిపోయాయి.

అక్టోబర్ నాటికి విద్యుత్ ఉత్పత్తి

సోలార్ ప్లాంట్‌ను పరిశీలించిన సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ



ప్లాంట్ పనులపై ఆరా తీస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రామవరం టూ టౌన్ పోలీసుస్టేషన్ సమీపాన 55 ఎకరాల్లో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో అక్టోబర్ నాటికి విద్యుత్ ఉత్పత్తి మొదలుకావాలని సింగరేణి డైరెక్టర్ బి.సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. రామవరంలోని ప్లాంట్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రూ.56 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేసేలా కావాల్సిన యంత్రాలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అక్టోబర్ నాటికి విద్యుత్ ఉత్పత్తి మొదలుపెట్టాలని స్పష్టం చేశారు. ఆతర్వాత గరిమెళ్లపాడులో 120 ఎకరాల్లో రూ.135 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న 22.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పనులను కూడా పరిశీలించారు. కాగా, ఏరియాలో 33 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయితే రోజుకు 1.45 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి.జానకీరామయ్య, రఘురాంరెడ్డి, కే.వీ.రావు, రామకృష్ణ, శ్రీకాంత్, రాజారాం, బోడా శంకర్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అవకాశం



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ పాపారావు

భద్రాచలంటౌన్: మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఉన్నత చదువులు పూర్తిచేసే అవకాశం ఉందని ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. భద్రాచలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన బుధవారం ప్రవేశాల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. 14ఏళ్లు నిండిన వారు పదో తరగతి, 15ఏళ్లు నిండిన వారు ఇంటర్‌లో చేరొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం కోర్డినేటర్ నీరజ, రమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడే తుది గడువు

కల్లూరు: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు గడువు గురువారంతో ముగియనుంది. అయితే, అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశముందని కల్లూరు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.కే.ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

‘సివిల్ సర్వీసెస్’ టోర్నీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని బుధవారం జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగులు తమ ఐడీ కార్డులు, బయోడేటా ఫాంతో పాటు ఒక ఫొటో జత చేసి ఈ నెల 11లోగా జిల్లా యువజన క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో హాకీ, క్రికెట్, ఎల్‌బీ స్టేడియంలో షటిల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, క్యారమ్స్, ఫుట్‌బాల్, పవర్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, గ్రీకోరోమన్, బెస్ట్ ఫిజిక్స్, టెన్నిస్, 20, 21 తేదీల్లో జింఖానా గ్రౌండ్స్‌లో అథ్లెటిక్స్, 21,22 తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీమారత్న అవార్డు ప్రదానం





సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఉమ, రామ్‌రెడ్డి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/భద్రాచలంటౌన్: ఎస్‌బీఐ లైఫ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు కొత్తగూడేనికి చెందిన మోతుకూరి ఉమకు బీమా రత్న, భద్రాచలానికి చెందిన ఉప్పాడ రామ్‌రెడ్డిలకు ఉత్తమ బీమా అవార్డు లభించింది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌బీఐ లైఫ్ డివిజనల్ మేనేజర్ జయకర్‌రావు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌బీఐ లైఫ్ సమరశంఖారావంలో ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

సమరయోధుల కుటుంబీకులకు సన్మానం



సన్మానం చేస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌కే నగర్‌లో క్విట్ ఇండియా డే సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు, మాజీ సైనికులు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన కుటుంబాలకు పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులైన సుదర్శన్ రావు, మాజీ ఎమ్మెల్యే కుమార్తె ఆకుల రమాదేవి, ఆకుల గోవిందరావు దంపతులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్, కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోనేరు నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ నరేంద్రబాబు, చుంచుపల్లి మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జామాయిల్ ధర పెంచాలి



మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధి సత్యనారాయణ

బూర్గంపాడు: ఆంధ్ర పేపర్‌మిల్లు స్థానికంగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న జామాయిల్‌కు ధర పెంచాలని జామాయిల్ సాగురైతుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. లక్ష్మీపురంలో బుధవారం జరిగిన సమావేశంలో సంఘ నాయకుడు నలజాల సత్యనారాయణ మాట్లాడారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ జామాయిల్ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు ఉచితంగా జామాయిల్ మొక్కలు ఇచ్చి, ఎకరానికి రూ 4500 పెట్టుబడి సాయమందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం జామాయిల్ కర్రకు డిమాండ్ ఉండటంతో ఆంధ్ర పేపర్ మిల్లు యాజమాన్యం లక్ష్మీపురంలో కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు.అయితే ఐటీసీ చెల్లిస్తున్న ధరలనే ఆంధ్ర పేపర్ మిల్లు చెల్లించటం సరికాదన్నారు. టన్నుకు రూ.7500 చెల్లించాలని ఆంధ్ర పేపర్ మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

వ్యవసాయ గణనను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఏఓ కొర్స అభిమన్యుడు



సమావేశానికి హాజరైన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వ్యవసాయ గణాంక సేకరణ 2021–22 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని పూర్తి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీఓ) శ్రీనివాసరావు సూచించారు. ఐడీఓసీ సమావేశపు హాలులో బుధవారం జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా హైదరాబాద్ అర్థగణాంక శాఖ నుంచి గీత, వెంకటనర్సయ్య హాజరుకాగా జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) కొర్స అభిమన్యుడు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఆగస్టు 15వ తేదీ లోగా గణనను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు ఆదేశించారు. ఎన్యుమరేటర్లుగా వ్యవసాయ విస్తరణాధికారులు గణాంకాలు సేకరించి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులు, మండల ప్రణాళిక, గణాంక అధికారులు, వ్యవసాయ సహాయ సంచాలకులు హాజరయ్యారు.

జీపీ భవనాలకు స్థల పరిశీలన

టేకులపల్లి: మండలంలోని గోలియాతండా, కోయగూడెం పంచాయతీ కార్యాలయ భవనాలకు జెడ్పీ సీఈఓ విద్యాలత బుధవారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో మంజూరైన 21 గ్రామ పంచాయతీలల్లో లభించిన స్థలాలు, నిర్మాణంలో ఉన్న భవనాల వివరాల గురించి ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. స్థలాలు లేని చోట తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ కేసు నమోదు

బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. లక్ష మాయం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ క్వార్టర్స్‌కు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో మోసానికి గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... ఐటీడీఏ క్వార్టర్స్‌కు చెందిన విజయ్‌కుమార్ ఈ నెల 5న ఓ యాప్‌లో సాంకేతిక లోపంపై కస్టమర్ కేర్ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడేందుకు యత్నించాడు. ఆన్‌లైన్‌లో లభించిన నంబర్‌కు కాల్ చేసి సమస్యను వివరించగా.. ఫోన్‌కు లింక్ పంపారు. లింక్ ఓపెన్ చేసి అవతలి వ్యక్తి సూచనలను పాటించడంతో సాంకేతిక సమస్య తొలగిపోయింది. కాగా ఈ నెల 7న బ్యాంక్ బ్యాలన్స్ చెక్ చేయగా విజయ్‌కుమార్ అకౌంట్ నుంచి రెండు దఫాలుగా రూ.లక్ష రూపాయలు డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు 1930 సైబర్ క్రైమ్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, సైబర్ క్రైమ్ వింగ్‌కు బదిలీ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

పెన్షన్ మంజూరైనా.. ఇవ్వట్లే!



వివరాలు వెల్లడిస్తున్న సనపా చిన్నక్క

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామానికి చెందిన సనపా చిన్నక్క(73)కు రాష్ట్ర ప్రభుత్వం 12 ఆగస్టు 2022న ఆసరా పెన్షన్ మంజూరు చేస్తూ మంజూరు పత్రం అందజేశారు. పెన్షన్ గుర్తింపు కార్డు కూడా ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు పింఛన్ ఇవ్వడం లేదు. ఏడాది నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆమె బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ‘సాక్షి’తో తన ఆవేదన వెల్లడించింది. పెన్షన్ మంజూరై సంవత్సరమైనా డబ్బులు రావడం లేదని, అధికారుల చుట్టూ తిరుగుతున్నానని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ : నలుగురికి గాయాలు



ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పాల్వంచరూరల్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని రంగాపురం గ్రామం వద్ద బీసీఎం రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ... భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పాల్వంచ వైపు వస్తోంది. అదే సమయంలో పాల్వంచ నుంచి సంగం వెళ్తున్న ఆటో రోడ్డు క్రాస్ చేస్తుండగా బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో ముందుభాగం దెబ్బతినగా ఆటో డ్రైవర్ చింతల నరేందర్‌తోపాటు, అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలైన దేరంగుల తిరుపతి, భద్రమ్మ, అప్పాజు శ్రీనులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోడ్రైవర్ సోదరుడు చింతల లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ గుత్త వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

పాల్వంచరూరల్: వేగంగా వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ కార్తీక్ కథనం ప్రకారం.. పాల్వంచ నుంచి బూర్గంపాడు వైపు వెళ్తున్న ఆటో మండల పరిధిలోని ఆర్టీఏ చెక్ పోస్టు సమీపంలో బూర్గంపాడు నుంచి పాల్వంచవైపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై వస్తున్న, చంచుపల్లికి చెందిన భూక్యా హరికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

‘లోవోల్టేజీ’తో గృహోపకరణాలు దగ్ధం

అశ్వారావుపేట: మండలం కేంద్రంలో లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్య కొనసాగుతూనే ఉంది. నెల రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల గృహోపకరణాలు దగ్ధమవుతున్నాయి. తాజాగా మంగళవారం రాత్రి స్థానిక కోతమిషన్ బజారులో విద్యుత్ సరఫరాలో వోల్టేజీ హెచ్చుతగ్గుల కారణంగా దాదాపు 15 నివాస గృహాల్లో విద్యుత్ పరికరాలు దగ్ధమైనట్లు గుర్తించారు. ఈ వీధిలోని ప్రజలు ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునేసరికి ఇళ్లలోని ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఫ్యానులు పనిచేయకపోగా కొన్ని కాలిపోయినట్లు గుర్తించారు. ట్రాన్స్‌కో సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది ఇలా జరగడం మూడోసారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈఈ శరత్ దృష్టికి తీసుకువెళ్లగా.. గతంలో వోల్టేజ్ హెచ్చుతగ్గుల గురించి తనకు ఫిర్యాదు అందిందని, న్యూట్రల్ తెగిపోవడం వల్ల హైవోల్టేజీ వచ్చి ప్రమాదం జరిగిందని తెలిపారు. సిబ్బందిని పంపి వోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

కూసుమంచి: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణిస్తే దేశాభివృద్ధిలో పాలు పంచుకునే అవకాశం లభిస్తుందని ముంబైలోని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బీఏఆర్సీ) శాస్త్రవేత్తలు సౌరబ్, అనురూప్ దాస్ తెలిపారు. కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం ‘పరమాణు జ్యోతి’ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హాజరైన శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అణువిద్యుత్ తయారీ కేంద్రాలు, ఉపయోగాలను వివరించి మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్న నేపథ్యాన విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా తయారుకావాలని సూచించారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపల్ నాగభూషణం మాట్లాడగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.